




'ఏపీ ఎంసెట్' ఫలితాల్లో నారాయణ హవా

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆంధ్ర ప్రదేశ్ ఎంసెట్ ఫలితాలలో తమ విద్యార్థులు టాప్ ర్యాంకులతో అత్యుత్తమ ప్రతిభ కనపరిచారని నారాయణ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగంలో బాబు సుజన్ రెడ్డి 4, శశాంక్ రెడ్డి 9, భువనచంద్ర 32, మిఖిల్ 34, వింధ్య 171, తనుష్ కుమార్ రెడ్డి 216, మనోజ్ 220, జస్విన్ రెడ్డి 225, కతి 282, హర్షిత 301, శశాంక్ యాదవ్ 432, అగ్రికల్చర్ విభాగంలో దేవ ధరుణ్ 207, కార్తికేయ రాయల్ 211, వెంకట రోహిత్ 318, చందన 344, పద్మ శ్రీ 376, ప్రవీణ్ కుమార్ 400, కృష్ణ చందన 424 ర్యాంకులతో మొత్తం మీద మొదటి వందలో నాలుగు, మొదటి వెయ్యిలో 32 ర్యాంకులతో తమ సత్తా చాటారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను డీన్లు, ప్రిన్సిపల్స్, అధ్యాపకులు అభినందించారు.


తిరుపతి రుయాలో..


సూళ్లూరుపేటలో...

ప్రాణ(రక్త)దాతలకు సన్మానం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, తిరుమల, సూళ్లూరుపేట

అత్యధికసార్లు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలిచిన 20 మంది రక్తదాతలను కమిషనర్ హరిత ఆధ్వర్యంలో సత్కరించారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా బుధవారం తిరుపతి రుయాలోని రక్తనిధి కేంద్రంలో రక్తదాతల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కమిషనర్ హరిత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, తిరుపతి రుయా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవి హాజరయ్యారు. ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో రక్తదానం చేయడానికి ప్రజలు ముందుకు రావడం లేదని అభిప్రాయపడ్డారు. నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్నారని, వారందరూ రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. 18-65 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి 45కేజీల బరువు కలిగిన వారందరూ రక్తదానం చేయవచ్చునన్నారు. ఆరోగ్యవంతులైన వారు ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడి ప్రాణదాతలు కావాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతులైన వారందరూ రక్తదానం చేసేలా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా పది విడతల నుండి 70 విడతలకు పైగా రక్తదానం చేసిన 20 మంది రక్తదాతలను రుయా ఆసుపత్రి రక్తదాన కేంద్రం ఆధ్వర్యంలో మెమెంటోలు, సర్టిఫికెట్లు ఇచ్చి ఘనంగా సన్మానించారు. ప్రపంచ రక్త దాన దినోత్సవం సందర్భంగా పలు స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు వైద్యాధికారిణి డాక్టర్ అరుణ సులోచన, రుయా అభివృద్ధి కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్, నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరికృష్ణ, రుయా డాక్టర్లు ఇ.బి.దేవి, డాక్టర్ సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో... ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం తిరుమలలోని అశ్విని ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. అశ్విని ఆసుపత్రి సివిల్ సర్జన్ డాక్టర్ ఎస్ కుసుమ కుమారి ఈ సందర్భంగా మాట్లాడుతూ 2004 నుండి ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారన్నారు. రక్తాన్ని ఇవ్వండి, ప్లాస్మా ఇవ్వండి, జీవితాన్ని పంచుకోండి అనేది ఈ సంవత్సరం అంశం అని ఆమె చెప్పారు. ఆసుపత్రిలో బుధవారం మొత్తం 24 మంది దాతలు ముందుకు వచ్చి రక్తదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సర్జన్లు డాక్టర్ పద్మజ, డాక్టర్ కళ్యాణి, డాక్టర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సూళ్లూరుపేటలో.. బుధవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరులోని రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాతలకు కలెక్టర్ హరి నారాయణ్ రెడ్ క్రాస్ చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా సేవా పురస్కారాలు అందచేశారు. తిరుపతి జిల్లా చిరంజీవి యువత, జనసేన పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో గత ఏడాది 760 యూనిట్లు ఇవ్వడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు తీగల చంద్రశేఖర్ రావు, సూళ్లూరుపేటకు చెందిన చిరంజీవి సేవా సంఘం అధ్యక్షులు మా బాషలకు సేవా పురస్కారం అందచేశారు.

'నీట్'లో నారాయణ విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ





'నీట్' పరీక్ష ఫలితాలలో నారాయణ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ప్రభంజనం సృష్టించారని ఆ విద్యాసంస్థల డిజిఎం కొండలరావు తెలిపారు. స్థానిక న్యూ బాలాజీ కాలనీలోని నారాయణ కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బుధవారం రాత్రి విడుదలైన జాతీయస్థాయి నీటి పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ప్రవీణ్ కుమార్ 3487వ ర్యాంక్, కృష్ణ చందన5605, దేవ దారుణ్7996, రెడ్డి శేఖర్ రెడ్డి12264, వెంకట రోహిత్ రెడ్డి 14029, విష్ణువర్ధన్ రెడ్డి13666, పద్మశ్రీ 14552, కార్తికేయ రాయల్19463 ర్యాంకులను సాధించారన్నారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. వారికి సహకరించిన అధ్యాపకులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీ సంచలనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ





జాతీయ స్థాయి నీట్ - 2023 ఫలితాల్లో స్తానిక ఎయిర్ బైపాస్ రోడ్డు లో ఉన్న డాక్టర్స్ మెడికల్ అకాడమి విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి తమ ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమి కళాశాలనందు 2023 విద్యాసంవత్సరమునకు తమ కళాశాల నుంచి 80 మంది ఎంబిబిఎస్ సీట్లు సాధించబోయే విద్యార్థులను అభినందించినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. బైపిసి చదివిన తమ విద్యార్థులు నీట్లో 720 మార్కులకు గాను మహమద్ షరీష్ అజ్మీ 680 మార్కులు, వి.వైష్ణవి 646 మార్కులు, వి. అర్జున్ రెడ్డి 632 మార్కులు, కె. లీనా సాయి 627 మార్కులు, యస్.విక్రమ్ నటరాజ్ 621, యస్.త్రిలోక్ రాజు 600 మార్కులు సాధించారు. 550 మార్కుల పైగా 25 మంది, 500 మార్కుల పైగా 50 మంది, 450 మార్కల పైగా 150 మంది మొత్తం 80 మంది పైగా విద్యార్థులకు ఫ్రీ మెడికల్ సీట్లు సాధిస్తారని చైర్మెన్ తెలిపారు. సీనియర్ అద్యాపకబృందంచే క్లాస్ రూమ్ టీచింగ్, స్టడీ అవర్స్ నిర్వహించడం అన్నారు. ఈ విజయం సాధించడానికి దోహదపడిన అధ్యాపకులకు, అధ్యాపకేతర సిబ్బందికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు కళాశాల చైర్మెన్ బి.వి. కృష్ణారెడ్డి, వైస్ చైర్మెన్ పార్థివ్ రెడ్డి, అకడమిక్ డైరెక్టర్ కె. రహీమ్ విలేకరుల సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు.

సాగుభూములు గిరిజనులకే ఇవ్వాలని ధర్నా

అటవీ అధికారుల హామీతో విరమణ

ప్రజాశక్తి - నాయుడుపేట 'అటవీ హక్కుల గుర్తింపు చట్టం -2006' ప్రకారం పెళ్లకూరు మండలం కానూరు రాజుపాలెం పంచాయతీలోని ఎగువకానూరు ఎస్టీ కాలనీ గిరిజనులకే సాగుభూములపై హక్కు కల్పించాలని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.హరినాథ్, సిఐటియు జిల్లా కార్యదర్శి గురవయ్య డిమాండ్ చేశారు. గిరిజనసంఘం, సిఐటియు సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సిఐటియు కార్యాలయం నుంచి నాయుడుపేట భూపయ్య కాలనీలోని అటవీ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి గిరిజనులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సర్వే నంబర్ 91-1ఎ, 2ఎ, 2ఎ1, 2బిలో రెండు దశాబ్దాలకు పైనే గిరిజనులు సాగు చేసుకుంటున్నారన్నారు. ఆ భూములపై వారికి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ వి.భాస్కర్‌రెడ్డి, డిఆర్ఒ ఎం.కోటేశ్వరరావులకు వినతిపత్రం ఇచ్చారు. గిరిజనుల సాగులో ఉన్న భూముల జోలికి రాబోమని అటవీ అధికారులు హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో నాయకులు ఎస్.ముకుంద, చెంచయ్య, వెంకటరమణయ్య, శేషమ్మ, గుపయ్య, సుభాషిణి, అనిత, రామయ్య, కానూరు ఎస్టీ కాలనీ గిరిజనులు పాల్గొన్నారు.





శ్రీవారి సేవలో కేంద్రమంత్రి పీయూష్ గోయల్

ప్రజాశక్తి -తిరుమల శ్రీవారి అనుగ్రహంతో భారతదేశం అన్ని విధాల అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించినట్లు కేంద్ర వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద ఆయనకు టిటిడి అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో సత్కరించారు.

రేపు 'ఏటీఎన్స్' కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి నగర పరిధిలోని సరోజినీ దేవి రోడ్డులో గల ఏటీన్స్ కళాశాల, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా ఈనెల 16న డిగ్రీ, పీజీ, డిగ్రీ చివరి సంవత్సరం చదివే విద్యార్థులకు జాబ్ మేళాను నిర్వహించనున్నారు. టెక్ మహీంద్రా, డిక్సన్, సోలెరా, నెక్స్ట జెన్ వంటి కంపెనీలు జాబ్ మేళాలో ఉపాధి కల్పించనున్నాయి. ఈ జాబ్ మేళాకు హాజరయ్యేవారు బయోడేటా, 10వ తరగతి, డిగ్రీ మార్కుల లిస్టు జిరాక్స్, ఆధార్, రెండు ఫోటోలను వెంట తెచ్చుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

భూహక్కు రీసర్వే పక్కాగా చేయండి

తిరుపతి టౌన్ : వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష రీసర్వే పనులు పక్కాగా నిర్వహించాలని కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డుల పరిధిలో 27 స్క్వేర్ కిలోమీటర్లు, 1800 ఎకరాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేయడం జరిగిందన్నారు. ల్యాండ్ క్లాసిఫికేషన్ చేస్తున్నామన్నారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, అర్బన్ తహశీల్దార్ వెంకటరమణ, రెవెన్యూ అధికారులు కె.ఎల్.వర్మ, సేతుమాధవ్ ఉన్నారు.

రుయా చిన్న పిల్లల వార్డులో ఓపీలు ఇవ్వాలి

తిరుపతి సిటి : రుయా హాస్పిటల్ చిన్నపిల్లల వార్డులోనే ఓపి ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి డిమాండ్ చేశారు. తిరుపతి నగర సమితి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకి రుయా హాస్పిటల్ మెయిన్ బిల్డింగ్ వద్ద నిరసన చేపట్టారు. గతంలో రుయా హాస్పిటల్ చిన్నపిల్లల వార్డులో ఓపీలు ఇచ్చేవారని, గత కొద్దిరోజులుగా ఓపీలు ఇవ్వకుండా ఆపేశారని, దీనివలన చిన్న పిల్లలకు సంబంధించిన తల్లిదండ్రులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు జిల్లా విశ్వనాథ్, కె.రాధాక్రిష్ణ పాల్గొన్నారు.

ఘాట్‌లో ప్రమాదాలు జరగకుండా శాంతి హోమం

ప్రజాశక్తి -తిరుమల

ఘాట్‌రోడ్లపై వరుస ప్రమాదాలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో వాటి నివారణకు శ్రీవారి ఆశీస్సులు కోరుతూ వైఖానస ఆగమంలో పేర్కొన్నవిధంగా విశిష్ట మహా శాంతి హోమం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో ఏవి ధర్మారెడ్డి తెలిపారు. బుధవారం డౌన్‌ఘాట్ రోడ్డులోని ఏడో మైలు శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి విగ్రహం వద్ద జరిగిన మహా శాంతి హోమంలో ఈవో పాల్గొన్నారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ ఘాట్‌రోడ్లలో వరుస ప్రమాదాల్లో ఏపీఎస్ఆర్టీసీ బస్సు బోల్తా, మరికొన్ని ప్రమాదాలు జరిగాయన్నారు. శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో భక్తులకు పెద్దగా గాయాలు లేకుండా బయటపడినట్లు తెలిపారు. ఈ ఘటనల అనంతరం ఘాట్ రోడ్డు ప్రమాదాలను ఎలా అధిగమించాలనే అంశంపై జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్టీసీ ఆర్ఎంలతో సమావేశం నిర్వహించినట్లు చెప్పారు. అదే సమయంలో, భక్తుల భద్రత కోసం శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ ఆంజనేయ స్వామివారి అనుగ్రహం కోరుతూ హోమం నిర్వహించాలని టీటీడీ ఆగమ సలహాదారులు సూచించారన్నారు. "భవిష్యత్తులో ఘాట్ రోడ్లలో ఇటువంటి దుర్ఘటనలు జరగకుండా ఉండేందుకు బుధవారం శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి సన్నిధిలో మహా శాంతి హోమం నిర్వహించిన్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటలకు విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన, రక్షాబంధనం, అగ్నిప్రతిష్ట, విశేష హోమంలతో మహా శాంతి హోమం ప్రారంభమై మహా పూర్ణాహుతితో ముగిసింది. శ్రీవారి ఆలయం డెప్యూటీ ఈవో లోకనాథం, ఋత్వికులు సీతారామాచార్యులు, అర్చక సాయి స్వామి, పారుపత్తేదార్ తులసీప్రసాద్ పాల్గొన్నారు.



వర్కింగ్ జర్నలిస్టు హెల్త్‌స్కీం దరఖాస్తులకు అవకాశం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ఈ ఏడాది కొత్తగా అక్రిడిటేషన్లు కార్డును పొందిన వర్కింగ్ జర్నలిస్టులు హెల్త్‌స్కీం పథకానికి దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా అక్రిడిటేషన్ కార్డును పొందిన వర్కింగ్ జర్నలిస్టులందరూ ఈ పథకం కింద ప్రీమియం పైకం రూ.1,250 చెల్లించి 2024, మార్చి 31 వరకూ లబ్ధి పొందాలని తెలిపారు. జర్నలిస్టులు ఒరిజనల్ చలానా, గతంలో జారీచేసిన హెల్త్‌కార్డు జిరాక్స్, ప్రస్తుత అక్రిడిటేషన్ కార్డు జిరాక్స్ కాపీలతో కలెక్టరేట్ నందో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యా లయంలో అందజేయాలన్నారు. జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ. 2 లక్షల వరకు విలువ చేసే వైద్యసేవలు అందుతాయని, ఇలా సంవత్సర కాలంలో ఎన్నిసార్లైనా పరిమితులు లేకుండా ఈసదుపాయాన్ని అందిస్తారని తెలిపారు.

ఎస్వీయూలో క్యాన్సర్ ప్రాథమిక పరీక్షలు ప్రారంభం



క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయంలోని జనాభా అధ్యయనం, సంఘ సేవ విభాగంలో టాటా ట్రస్ట్ స్వీకార్, చదలవాడ డెంటల్ కాలేజ్ వారి సహకారంతో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్, బీపీ, షుగర్, సర్వికల్ క్యాన్సర్ పరీక్షలు పరీక్షలు ఉచితంగా నిర్వహించే కార్యక్రమాన్ని ఎస్ వియు జనాభా అధ్యయన విభాగంలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా విభాగాధిపతి డాక్టర్ డాక్టర్ టీ. చంద్రశేఖరయ్య మాట్లాడుతూ నేడు మానవుడు బిజీ లైఫ్ లో అనునిత్యం సంపాదనలో పడి ఆరోగ్యంపైన శ్రద్ధ చూపడం లేదన్నారు. మారుతున్న కాలానుగుణంగా వాతావరణంలో మార్పులు కాలుష్యం వల్ల ఆహారంలో కల్తీలవల్ల వివిధ రోగాల బారిన పడుతున్నారన్నారు. ప్రజల అవగాహన నిమిత్తం క్యాన్సర్ ఉచిత అవగాహన సదస్సు, ప్రాథమిక పరీక్షలు ఏర్పాటు చేశామని దీని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. ఈ క్యాంపులో 85 మంది క్యాన్సర్ ప్రాథమిక పరీక్షను, 110 డెంటల్, బీపీ, షుగర్ పరీక్షలను చేసుకున్నారని వెల్లడించారు. టాటా ట్రస్ట్ జిల్లా మేనేజర్ హేమంత్ కుమార్, టాటా ట్రస్ట్ సిబ్బంది, జనాభా అధ్యయన విభాగం టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, చదలవాడ డెంటల్ కాలేజ్ విభాగాధిపతి డాక్టర్ శిరీష పాల్గొన్నారు.

హిందూ ధర్మాన్ని రక్షిద్దాం

'దళిత గోవిందం' శిక్షణలో ఎస్సీ కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - తిరుపతి



హిందూధర్మాన్ని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందని ఎస్ సి కమిషన్ మెంబర్ చల్లెం ఆనంద ప్రకాష్ తెలిపారు. బుధవారం ఉదయం స్థానిక శ్రీ పద్మావతి అతిథి గహం నందు దళిత గోవిందం' శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఎస్ సి కమిషన్ మెంబర్ మాట్లాడుతూ.. కుల వ్యవస్థ నిర్మూలన దిశగా తిరుమల తిరుపతి దేవస్థానం దళిత గోవిందం అర్చకుల శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఈ శిక్షణలో 43 మందికి 15 రోజులు శిక్షణ ఇచ్చి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాలకు అర్చకులుగా నియమించడం జరుగుతుందని తెలిపారు. టిటిడి చైర్మన్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో దళిత గోవిందా అర్చక శిక్షణ కార్యక్రమం నిర్వహించడం శుభదాయకమని అన్నారు. ఈ శిక్షణ కార్యక్రమంలో శిక్షణ కోఆర్డినేటర్ హేమంత్ కుమార్, ట్రైనర్లు వెంకటేశ్వరరావు, అనకాపల్లి రాంబాబు, అనకాపల్లి సూర్యప్రకాష్ విశాఖపట్నం, రాధా నంద్యాల, మనోరమ నంద్యాల, రోజా విశాఖపట్నం, అరుణబాయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 11-13 తేదీల్లో క్రెడాయ్ ప్రాపర్టీ షో



తిరుపతి టౌన్ : నగర ప్రజల కోసం నూతనంగా 18 మాస్టర్‌ప్లాన్‌రోడ్లను ఏర్పాటు చేశామని, క్రెడాయి సంస్థ దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి తెలిపారు. ఓ ప్రైవేట్ హెూటల్లో క్రెడాయ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రాపర్టీ ఎక్స్ పో 2023 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆగస్టు 11, 12, 13 తేదీల్లో తిరుపతిలో జరగనున్న ప్రాపర్టీ షో బ్రోచర్ ను భూమన కరుణాకర రెడ్డి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నూతన మాస్టర్ ప్లాన్ రోడ్ల వల్ల 3800 ఎకరాలు అభివద్ధి చెందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్రెడాయ్ అధ్యక్షుడు రాంప్రసాద్ రావు, చైర్మన్ శ్రీనివాసులు, కార్యదర్శి రాజేష్ బాబు, కోశాధికారి రాజశేఖర్ రావు పాల్గొన్నారు

బ్రెజిల్ పర్యటనలో తిరుపతి ఎంపి గురుమూర్తి

తిరుపతి టౌన్ : కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ ఆధ్వర్యంలో బ్రెజిల్‌లో పలు అంశాలను పరిశీలించేందుకు తిరుపతి ఎంపి గురుమూర్తి సైతం వెళ్లారు. ఒక కేంద్రమంత్రి, తొమ్మిదిమంది ఎంపీలతో ఈ బృందం రెండు రోజుల క్రితం బ్రెజిల్ చేరుకుంది. ఈ బృందానికి కేంద్ర బొగ్గు గనుల శాఖా మంత్రి ప్రహ్లాద్‌జోషి నేతృత్వం వహిస్తున్నారు. వారు అనుసరిస్తున్న ఆర్థిక విధానాలు, వ్యవసాయంలో అధునాతన పద్ధతులను పరిశీలిస్తున్నట్లు ఎంపి గురుమూర్తి తెలిపారు. మన రాష్ట్రానికి సంబంధించి ఒంగోలు జాతి గిత్తల ద్వారా ఆ దేశం వారు రూపొందించిన సాంకేతికతను అధ్యయనం చేస్తున్నామన్నారు. సమావేశంలో ఆ దేశ ముఖ్యులు అయినటువంటి సెనేటర్ నెల్సిన్హో ట్రేడ్ మిస్టర్ రోడ్రిగో పచేకో, బ్రెజిలియన్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ మిస్టర్ మార్కోస్ పెరీరా తదితరులు పాల్గొన్నారు.



పద్మభూషణ్ డాక్టర్ కుమార బిర్లా జన్మదిన వేడుకలు



తిరుపతి టౌన్ : పద్మభూషణ్ డాక్టర్ కుమార బిర్లా జన్మదిన వేడుకలు గాంధీరోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్టు కార్యాలయంలో ట్రస్టు చైర్మన్ డాక్టర్ పిసి రాయులు అధ్యక్షతన వేడుకగా జరిగాయి. ముఖ్య అతిథి శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం చేతుల మీదుగా వెయ్యి మందికి అన్నదానం, వస్త్రదానం చేశారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పిసి రాయల్ మాట్లాడుతూ బిర్లా కంపెనీ వారు ప్రపంచంలోనే 147 దేశాల్లో వారి కంపెనీల ద్వారా వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారని, ఆధ్యాత్మికతను పెంచేలా గుడులు నిర్మించారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పొన్నాల చంద్ర రేవతి, కల్పన, శైలజ, బండి మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను కుప్పం నుంచే ప్రారంభిస్తా..!

ప్రజాశక్తి - కుప్పం, శాంతిపురం

'సంక్షేమ పథకాలను కుప్పం నుంచే ప్రారంభిస్తా' అని టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు. కుప్పం నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌నుంచి బెంగుళూరు చేరుకున్న ఆయన అక్కడనుంచి రోడ్డు మార్గంలో కర్నాటక సరిహద్దుకు చేరుకున్నారు. అక్కడ టిడిపి శ్రేణులు భారీ గజమాలలతో చంద్రబాబుకు స్వాగతం పలికారు. రాళ్లబూదుగూరు బస్టాండ్‌లో తాను తీసుకొస్తున్న ఎన్నికల మినీ మ్యానిఫెస్టోను వివరించారు. అక్కడనుంచి కుప్పం చేరుకున్న ఆయన బిసిఎన్ కన్వెన్షన్ హాలులో నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశమయ్యారు. తన సొంత నియోజకవర్గంలో సొంత ఇల్లు నిర్మించుకోడానికి సయితం తనకు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. వైసిపి పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిందన్నారు. సీఎం జగన్ అంత అవినీతిపరుడు దేశంలో ఎవరూ లేరని సాక్షాత్తు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చెప్పడాన్ని రాష్ట్ర ప్రజలు గమనించారన్నారు. సీఎం అవినీతిపై కేంద్రమంత్రులు ప్రకటన చేయడం కాదని, జగన్‌పై చర్యలు ఎపుడు తీసుకుంటారో చెప్పాలన్నారు. కుప్పంలో గ్రానైట్‌ను దోచేస్తున్నారని, టిడిపి అధికారంలోకి వచ్చాక దోచిందంతా కక్కిస్తానన్నారు. రెండువేల రూపాయల నోట్లను వైసిపి నేతలు బ్రాందీషాపుల్లో మార్చుకుంటున్నారని, దీనిపై కేంద్రం దృష్టి సారించాలన్నారు. సంక్షేమ పథకాలకు తమ పార్టీ వ్యతిరేకం కాదని, అయితే అప్పులు చేసి కాకుండా, సంపద సృష్టించి అందించాలన్నారు. ప్రశాంతమైన కుప్పంలో రౌడీలతో బెదిరిస్తున్నారని, వడ్డీతో సహా లెక్కపెట్టి అణచివేస్తానన్నారు. తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిన వారిని వదిలేది లేదన్నారు. రాత్రికి ఆర్ అండ్ బి అతిథిగృహంలో బస చేయనున్నారు. గురువారం కుప్పంలోనే నియోజకవర్గ కార్యకర్తలతో సమావేశం కానున్నారు. ఇతర పార్టీల నాయకులను భారీ స్థాయిలో టిడిపిలోకి ఆహ్వానం పలకనున్నారు. అనంతరం కుప్పంలో భారీ బహిరంగసభలో పాల్గొంటారు.


కుప్పం పర్యటనలో నారా చంద్రబాబునాయుడు



కుప్పంలో నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నారా చంద్రబాబునాయుడు

రెవెన్యూలో బదిలీ'లీల'లు

ప్రజాశక్తి-సత్యవేడు: నియోజకవర్గంలో తహశీల్దార్ల బదిలీలు ప్రహసనంలా మారింది. ఏ తహశీల్దార్ ఏ మండలంలో ఎన్ని రోజులు ఉంటారో, ఎప్పుడు మండలం వీడి వెళ్లిపోతారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొనింది. ప్రధానంగా నియోజకవర్గ కేంద్రం సత్యవేడులో తహశీల్దార్ శ్రీదేవి గత ఏప్రిల్‌లో ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. పట్టుమని రెండు నెలలు కాకమునుపే ఆమెను కెవిబి పురం మండలానికి బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఈ బదిలీ వెనుక రాజకీయ కోణం దాగుందన్న విమర్శలు పెద్ద ఎత్తున వినబడుతున్నాయి. ఇలా మండలంలో తరచూ తహశీల్దారులను బదిలీ చేస్తుండటంతో భూ సమస్యలు ఎక్కడికక్కడ పేరుకు పోతున్నాయని సర్వత్రాభిప్రాయం వ్యక్తం అవుతోంది. తహశీల్దార్ల బదిలీ విషయంలో జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. శ్రీదేవి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కొన్ని విధానపరమైన నిర్ణయాల్లో ఆచితూచి వ్యవహరిస్తుండటం, గ్రావెల్ క్వారీల అనుమతుల విషయంలో నిక్కచ్చిక వ్యవహరించడం వల్లే మింగుడు పడని రాజకీయ యంత్రాంగం ఆమెను ఇక్కడి నుంచి బదిలీ చేస్తున్నారన్న ప్రచారం జోరుగా జరుగుతోంది.




క్వారీలకు అనుమతులు ఇవ్వకపోవడంతోనే..

మండలంలో విచ్చలవిడిగా జరుగుతున్న గ్రావెల్ క్వారీలకు అనుమతులు ఇవ్వడం లేదని, మండలంలో రాజకీయ నాయకులు చెప్పినట్లు నడుచుకోవడం లేదని తహశీల్దార్‌ను బదిలీ చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. ఇలాంటివి రాజకీయ నాయకులు మానుకోవాలి- **సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎం రమేష్**

అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అంగన్‌వాడీల హక్కుల సాధనే లక్ష్యంగా సీఐటీయూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి పెనగడం గురవయ్య బుధవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. స్థానిక శ్రీకాళహస్తి ఐసీడీఎస్ కార్యాలయం వద్దకు వర్కర్లు, హెల్పర్లు చేరుకుని తమ నిరసన గళాన్ని వినిపించాలని సూచించారు.

ఆగస్టు 7న ఓబీసీ మహాసభ



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగరంలో ఆగస్టు 7వ తేదీన 8వ జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ మహాసభకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ఆహ్వానించామని రాష్ట్ర ఓబీసీ మహా సంఘం ప్రతినిధుల బృందం నాయకులు తెలిపారు. ఈ మేరకు బుధవారం తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌కు ఆహ్వాన పత్రికను అందించారు. 2016 సంవత్సరం నుంచి ప్రతి ఏటా దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ఓబీసీ లందరినీ కలుపుకొని మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. తిరుపతిలో జరిగే జాతీయస్థాయి మహాసభలో ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలు, డిమాండ్లను చర్చిస్తామన్నారు. సీఎంను ఆహ్వానించిన వారిలో ఓబీసీ జాతీయ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకర్రావు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు కల్లూరి నాగరాజ గౌడ్ ఉన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మూడు ముళ్ళు, ఏడడుగుల వివాహ బంధంతో ఒక్కటి కానున్న నూతన దంపతులను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆశీర్వదించారు. రేణిగుంట మండలం ఆర్. మల్లవరం సర్పంచ్ బాబ్జి కుమారుడు డాక్టర్ శశిధర్ రెడ్డి నిశ్చితార్థ వేడుకలు బుధవారం ఏలూరులో జరిగాయి. ఈ నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాబోయే వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో గాజులమండ్యం సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



ప్రజాశక్తి-గూడూరు టౌన్: క్రీడలతో ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద రావు అన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని ఆది శేషారెడ్డి స్టేడియంలో క్రీడాకారులకు ఎమ్మెల్యే జ్యూస్, ఎనర్జీ డ్రింకులను అందజేశారు. తక్షణం క్రీడాకారులకు ఆర్థికసాయంగా ఆయన రూ. 10 వేలు అందజేశారు. అనంతరం క్రీడాకారులకు జిమ్మును ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో అంతర్లీనంగా దాగి ఉండే ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని, అలాంటప్పుడే వారు రాణించగలుగుతారని అన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టాల పంపిణీకి చర్యలు



ప్రజాశక్తి-గూడూరు: భూములు సాగు చేసుకుంటున్న అనుభవదారులకు పూర్తి హక్కు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి బుధవారం తెలిపారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి భూములను గుర్తించినట్లు చెప్పారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన ఆర్డీఓ కిరణ్ కుమార్‌తో కలిసి మీడియాతో మాట్లాడారు. జీవో నెంబర్ 128 ప్రకారం సాగు చేసుకుంటున్న భూములకు హక్కులు కల్పించే అవకాశం ఉందని గుర్తు చేశారు. ఇలా 535 మంది లబ్ధిదారులకు నియోజకవర్గంలో 346.20 ఎకరాల భూమికి హక్కులు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఇలా హక్కులు కల్పించే భూమి రెండు వేల ఎకరాలకు పెంచేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న వారు వారి వివరాలను సంబంధిత తహశీల్దార్ కార్యాలయాల్లో అందించాలని ఈ సందర్భంగా సూచించారు.

వాకర్స్ అసోసియేషన్ రక్తదానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ప్రపంచ రక్తదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామచంద్ర నాయుడు, ఆకర్ష అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ రవి రాజుల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ రక్తదానం ట్రస్ట్‌తో కేకేసీ హోమియోపతి కళాశాల విద్యార్థులు కలిసి వాకర్స్ అసోసియేషన్ భవనంలో రక్తదానం సేకరించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేయడం జరిగింది. అందులో భాగంగా రక్తదానం కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఆయన కేకేసీ హోమియోపతి కళాశాల విద్యార్థులకు, యాజమాన్యానికి కతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సెక్రటరీ గోపికష్ణ, రఘునాథరెడ్డి, ట్రెజరర్ గుణశేఖర్ రెడ్డి, కేకేసీ కళాశాల ఛైర్మన్ కుప్పయ్య శెట్టి, వైస్ ఛైర్మన్ కే నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వెర్మిసెల్లీ మిశ్రమాన్ని విడుదల చేసిన 'ఎంటిఆర్'



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: ప్యాకేజ్డ్ ఫుడ్స్‌లో అగ్రగామి అయిన ఎంటిఆర్ ఫుడ్స్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు తెలుగురాష్ట్రాల్లో నూతనంగా తయారు చేసిన వెర్మిసెల్లీ మిశ్రమాన్ని, వెరిమినీ డిలిగెట్ను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈసందర్భంగా ఆ సంస్థ మార్కెటింగ్ జనరల్ మేనేజరు పేర్నాటికు స్థానిక తిరుమల బైపాస్ రోడ్డులో ఉన్న ఓ ప్రైవేటు హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంటిఆర్ వెర్మిసెల్లీ డిలైట్ అనేది తెలుగు రాష్ట్రాల వినియోగదారుల కోసం ప్రత్యేకంగా తయారు చేసిందన్నారు. ఎంటిఆర్ సాంబారు, రసం, మసాలాలు, గులాబ్ జామూన్ మిక్స్ వంటి వాటిని ప్రతిఇంటి లోనూ ఇష్టపడుతుంటారని అన్నారు. వినియోగదారులు ఆశీస్సులతో మా వస్తువులకు బలమైన బ్రాండ్‌గా పేరుగడించిందని తెలిపారు. వెర్మిసెల్లీ మిశ్రమం ఈప్రాంతం అభిరుచికి తగినట్లుగా ప్రత్యేకంగా సష్టించబడిందన్నారు. పాత్రలకు అంటుకోవడం, ముద్దగా కావడం వంటి జరగదని హామీ ఇస్తున్నామన్నారు. ఈమిశ్రమం ప్రత్యేక వేరియంట్, ఆంధ్ర, తెలంగాణ నిర్దిష్ట వంటల శైలిని దష్టిలో ఉంచుకుని తయారు చేయబడిందని అన్నారు. ఇటీవల విడుదల చేసిన మూడు పొడిలు శ్రేణి, ఇడ్లీ కారం పొడి, కరివేపాకు పొడి, కంది పొడి కూడా వాటి అసలైన రుచి కారణంగా అందరికీ నచ్చాయన్నారు. ఎంటిఆర్ వెర్మిసెల్లీ డిలైట్ వినియోగదారులను ఆకట్టుకుంటుందని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి



ప్రజాశక్తి-గూడూరు టౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలని బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో గూడూరు శాసన సభ్యులు వెలగపల్లి వరప్రసాద్ రావుకు వినతి పత్రాన్ని అందించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్ మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మిట్ చేయాలి లేదా సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను పునరుద్ధరించాలి. క్లాప్ ఆటోల డ్రైవర్లకు జీఓ నెంబర్ 7 ప్రకారం నెలకు రూ.18,500/- వేతనం ఇవ్వాలని తెలిపారు. మున్సిపల్ పర్మినెంట్ ఉద్యోగులకు రెండు సంవత్సరముల సరెండర్ లీవు వేతనం ఇచ్చి, ఇంజినీరింగ్ విభాగం కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్, రిస్క్, అలవెన్స్‌లు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా వైసీపీ ప్రభుత్వం 50 వేలకు పైగా ఉన్న మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు, సిపిఎస్ ఉద్యోగులు, క్లాప్ డ్రైవర్ల కింద సమస్యలు వెంటనే పరిష్కరించవలసిందిగా కోరారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ కార్మికులను కలుపుకొని ఆందోళన కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు జోగి శివకుమార్, బివి రమణయ్య, జిల్లా కమిటీ సభ్యులు పెంచల ప్రసాద్, రాఘవ, పట్టణ కమిటీ సభ్యులు మహేష్, పెంచల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐఐహెచ్‌టి ఫౌండేషన్ అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరిలో నేదురుమల్లి మార్క్ నేటికీ కనిపిస్తూనే ఉంటుంది. అదే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ. కీర్తిశేషులు నేదురుమల్లి జనార్దన్ రెడ్డి సీఎంగా ఉన్న రోజుల్లో వెంకటగిరికి కొన్ని అభివద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. ఈ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ భవనాలు పాతబడడంతో మరమ్మత్తుల కొరకు నేదురు మల్లి ఫౌండేషన్ ట్రస్ట్‌తో నేదురుమల్లి జనార్దన్ రెడ్డి తనయుడు రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఛైర్మన్, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి రూ.25 లక్షలతో భవన మరమ్మతులను చేయించి పూర్వ వైభవాన్ని కలిగిస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ నక్క భానుప్రియ, జిల్లా గ్రంథాలయ శాఖ ఛైర్మన్ దొంతు శారద, హ్యాండ్లూమ్ టెక్నాలజీ ఏడీ మురళీకష్ణ, చేనేత రాష్ట్ర కమిటీ సభ్యులు, నక్క వెంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



ప్రజాశక్తి-క్యాంపస్: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని వైఎస్సార్ విద్యార్థి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు బి.ఓబుళ రెడ్డి పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ఆరంభంలోనే జగనన్న విద్యా కానుక పేరుతో పది రకాల సామాగ్రితో కూడిన కిట్టును రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు అందించడంపై బుధవారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎస్వీయూ క్యాంపస్ స్కూల్లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఓబుళ రెడ్డి మాట్లాడుతూ నాడు-నేడు, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద వంటి అనేక గొప్ప పథకాలతో విద్యా రంగాన్ని ఉన్నతంగా ప్రభుత్వం తీర్చిదిద్దుతోందని కొనియాడారు. కార్యక్రమంలో మణి, ప్రదీప్, ప్రశాంత్, కేదార్, తాహిర్, భాష, ప్రసన్న కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ



ప్రజాశక్తి-సత్యవేడు: ప్రాథమిక విద్య ఆవశ్యకతపై అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో జనభగీదారి ర్యాలీలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం సత్యవేడు మండలం వెంకట రాజులకండ్రిగ గ్రామంలో జనభగీదారి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్త సురేఖ మాట్లాడుతూ పిల్లల్లో ప్రాథమిక విద్య హత్తుకు పోవడానికి సంబంధిత కిశోర బాలికలు, తల్లిదండ్రులను భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. పుట్టిన మూడేళ్ల వరకు తల్లి ఒడికి పరిమితమైన పిల్లలు అనంతరం బాహ్య ప్రపంచాన్ని తెలుసుకునేందుకు ఆసక్తి చూపుతారన్నారు. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రంలోనూ ఆటపాటల ద్వారా పిల్లలకు సులువైన పద్ధతిలో ప్రాథమిక విద్యను బోధిస్తున్నట్టు ఆమె గుర్తు చేశారు. దలవాయి అగ్రహారం గ్రామంలో గ్రామ సర్పంచ్ మంజుల రమేష్ ఆధ్వర్యంలో కూడా అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా రేవతి, ఎఎన్ఎం రేణుక, ఎల్ఎంహెచ్‌పి సౌమ్య, ఆశ వర్కర్ బుజ్జమ్మ, స్థానిక పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రీడా పాఠశాల ప్రవేశాలకు ఎంపిక

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 4, 5 తరగతుల ప్రవేశాలకి ఈనెల 15వ తేదీ నుంచి మండల స్థాయి ఎంపికలను నిర్వహించినట్లు సెట్విన్ సీఈవో మురళీకష్ణ, చీఫ్ కోచ్ సయ్యద్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షులు వై ప్రవీణ్ సంయుక్త ప్రకటనలో తెలిపారు. 2023- 24 విద్యా సంవత్సరానికి 4 తరగతిలో 40 సీట్లు, 5 తరగతిలో 7 సీట్లకు ఎంపిక నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి20 వరకు మండల స్థాయి ఎంపికలు ఎంపీడీవో ఆధ్వర్యంలో, 22 నుంచి 26 వరకు జిల్లాస్థాయిలో సెట్విన్ సీఈవో ఆధ్వర్యంలో, 29,30న రాష్ట్రస్థాయిలో శాప్ ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్సిటీలో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఎస్వీ యూనివర్సిటీ స్టేడియం వద్ద ఎంపికలు జరుగుతాయని వెల్లడించారు. ఎంపికకు హాజరు అయ్యేవారు క్యాస్ట్ సర్టిఫికెట్, స్టడీ, బర్త్ సర్టిఫికెట్, ఇన్కమ్ సర్టిఫికెట్, నాలుగు పాస్పోర్ట్ సైజు ఫోటోలతో హాజరు కావాలని సూచించారు. అర్హులు దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడ్కో ఇళ్ల పరిశీలన



ప్రజాశక్తి-వెంకటగిరి: నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి బుధవారం టిడ్కో ఇళ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ టిడ్కో ఇళ్లలో అన్ని సౌకర్యాలు త్వరగా ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందించి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గృహప్రవేశాలు చేసే రోజే మున్సిపాలిటీలో గృహ ప్రవేశాలు చేయాలని, అందరూ సహకరించాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య, హౌసింగ్ డిఇ, ఏఈలు, విద్యుత్ శాఖ అధికారులు, అన్ని వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని వాగివేడు పంచాయతీలో గల వేల్లంపల్లి ఎస్టీ కాలనీలో బుధవారం తెల్లవారుజామున పూరి గుడిసె అగ్నికి ఆహుతి అయిన సంఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. వేల్లంపల్లి ఎస్టి కాలనీలో నివాసం ఉంటున్న నాగయ్య, సుబ్బమ్మ దంపతుల పూరి గుడిసె అగ్నికి ఆహుతై నిలువ నీడ లేక నిరాశ్రయులు అయ్యారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీకాళహస్తి నియోజకవర్గ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె బియ్యపు పవిత్ర రెడ్డి వెల్లంపల్లి గ్రామానికి చేరుకొని బాధితులను పరామర్శించి మేము మీకు అండగా ఉంటామని తెలిపారు. అనంతరం వారి కుటుంబానికి 150 కేజీల బియ్యాన్ని, రూ.15 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనమ్మ, మాజీ ఎంపిటీసీ పార్వతి, వాసుదేవరెడ్డి, ప్రసాద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర గంజాయి స్మగ్లింగ్ ముఠా అరెస్టు



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠాలో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా, కలిగి ఉండటమూ రెండూ చట్ట ప్రకారం నేరం అన్నారు. మంగళవారం సాయంత్రం భారీ మొత్తంలో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకున్నామన్నారు. వెంకటగిరి సర్కిల్, ఏర్పేడులో 13న సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తూ కెఎల్ 01 బిఎఫ్ 1073 మహేంద్ర వాహనంలో గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 150 కేజీల గంజాయి 4 మొబైల్ ఫోన్లు, వాహనం సీజ్ చేశామన్నారు.దీనిపై విచారణ చేపట్టి అనకాపల్లి, విశాఖపట్టణం ఏజెన్సీ తదితర ప్రాంతాల నుంచి గంజాయి స్మగ్లింగ్ చేసి, సరఫరా చేసే ముఠాకు చెందిన ఇద్దరు, కేరళ రాష్ట్రానికి చెందిన కొనుగోలుదారుడు గంజాయి స్మగ్లింగ్ ముఠాకు చెందిన ఇంకా కొందరిని అరెస్టు చేయవలసి ఉన్నదని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో కేరళకు చెందిన జిజేష్, అనకాపల్లికి చెందిన వెంకటరమణ, రామకష్ణ వున్నారు. కేరళకు చెందిన రంజిత్, విష్ణు, శ్రీజిత్, అనకాపల్లికి చెందిన పవన్, నిరంజన్‌ను అదుపులోకి తీసుకోవాల్సి ఉందన్నారు. ఈ సమావేశంలో రేణిగుంట డిఎస్పి భవ్య కిషోర్, సిఐలు శ్రీహరి, సుబ్బారెడ్డి, ఎస్సై ఈశ్వరయ్య, ఏర్పేడు, రేణిగుంట పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి: కార్పొరేటర్

ప్రజాశక్తి-క్యాంపస్: నగరపాలక ప్రాథమిక పాఠశాల పట్నూలు వీధిలో జగనన్న విద్యా కానుక సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వార్డు కార్పొరేటర్ బసవా గీత హాజరై మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా పాఠశాలలకు అవసరమైన మౌలిక వసతులు నాడు-నేడు కార్యక్రమం ద్వారా అందిస్తూన్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన యూనిఫామ్, బ్యాగు, పుస్తకాలు ,బెల్టు, షూ, మధ్యాహ్న భోజన పథకం ద్వారా నాణ్యమైన, పోషకాహార విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తూ విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్నారని కొనియాడారు. విద్యార్థులు ఇష్టపడి ,కష్టపడి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునికష్ణ నాయుడు, బసవా బాలసుబ్రమణ్యం, ఉపాధ్యాయులు జయంతి, హేమ మాధురి, కష్ణవేణి, సుజాత పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి-నాగలాపురం: డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ నాగరత్నం, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ఏకాంబరం ఆదేశాల మేరకు దాతలు కోరిన సమయంలో స్వామి వారి ఆలయంలో అన్నదాన కార్యక్రమం చేసుకోవచ్చని ఆలయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం స్వామివారి ఆలయంలో ఏకాదశి సందర్భంగా ఆలయంలో పనిచేస్తున్న పరిచారకులు రమేష్ స్వామి, సిబ్బంది సుధాకర్ చేతుల మీదుగా భక్తులకు ఉదయం అల్పాహారాన్ని వితరణగా అందజేశారు.

బాధ్యతల స్వీకరణ



శ్రీకాంత్, ఎస్ఐ



ఏపీఓ కృష్ణయ్య

ప్రజాశక్తి-సత్యవేడు: సత్యవేడు నూతన ఎస్ఐ-1గా శ్రీకాంత్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం స్థానిక ఎస్సై గా పురుషోత్తం రెడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో పిచ్చాటూరు ఎస్సైగా పనిచేస్తున్న శ్రీకాంత్‌రెడ్డిని సత్యవేడు ఎస్ఐ-1గా ఇక్కడకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, జూదం, అక్రమ మద్యం తది తర వాటిపై ప్రత్యేక దష్టి సారిస్తామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంత టివారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఉపాధి హామీ పథకంలో మండల ఏపీఓగా కృష్ణయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏపీఓగా పనిచేస్తున్న భాస్కరయ్య బదిలీపై వరదయ్యపాలెం వెళ్లడంతో గత ఆరు నెలలుగా ఎంటిసి లోకమ్మ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. నూతన ఉపాధి ఏపీఓగా బాధ్యతలు స్వీకరించిన కష్ణయ్య శ్రీకాళహస్తి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. అలాగే ఎంపీడీవోగా చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా పరిగి మండలం పంచాయతీరాజ్ విస్తరణ అధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్ పదోన్నతిపై ఎంపీడీవోగా ఇక్కడికి వచ్చారు. సత్యవేడు ఎంపీడీవోగా గతంలో పనిచేసిన బాల గణేష్ ఆకస్మికంగా మృతి చెందడంతో మండల పరిషత్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న రమణ కుమార్‌కు ఎంపీడీవోగా ఇన్‌ఛార్జ్ బాధ్యతలను రెండు నెలల క్రితం అప్పగించారు. ఈ నేపథ్యంలో పరిగి మండల ఈవోఆర్డీగా పని చేస్తున్న చంద్రశేఖర్‌కు పదోన్నతి రావడంతో సత్యవేడు ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు జిల్లా అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి అందాయి.



ఎంపీడీవో చంద్రశేఖర్

తిరుచానూరు: తిరుచానూరు సీఐగా బి.శివ ప్రసాద్ రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్లో సీఐగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజల శాంతి భద్రతలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా చేస్తానని పేర్కొన్నారు. గతంలో తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో సీఐగా బాధ్యతలు నిర్వర్తించిన సుబ్రహ్మణ్యం రెడ్డి ఎంఆర్ పల్లి స్టేషన్‌కు బదిలీ అయ్యారు.



శివ ప్రసాద్ రెడ్డి, సీఐ,

పుత్తూరు టౌన్: ఎంపీడీవోగా భాను మూర్తి బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఆయన ఇంతకు ముందు సదుంలో పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీవో ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు బదిలీపై నింద్ర మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన్ను మండల అధ్యక్షులు వైఎస్ విజయలక్ష్మి చైతన్య మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి శేఖర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోకేశ్వర రెడ్డి, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



భాను మూర్తి , ఎంపీడీవో

జగనన్న విద్యా కానుక పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని పట్నూలు వీధిలో గల నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో జగనన్న విద్యా కానుకను బుధవారం స్థానిక వార్డు కార్పొరేటర్ బసవా గీత ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో విద్యారంగంలో మంచి మార్పులు తీసుకువచ్చారని తెలిపారు. ముఖ్యంగా నాడు-నేడుతో పాఠశాల సౌకర్యాలు ఎంతో మెరుగుపడ్డాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సీఎం జగన్ విప్లవాత్మక చర్యలు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ బడుల్లో చదువుకునే విద్యార్థులకు చదువు దగ్గర నుంచి వారికి అవసరమైన ప్రతి ఒక్క సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం అందించడం గొప్ప విషయం అన్నారు. జగనన్న విద్యా కానుకలో భాగంగా బ్యాగు, పుస్తకాలు, బెల్టు, షూలు వంటివే కాకుండా మంచి ఆరోగ్యం కోసం పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను విద్యార్థులకు అందించడం జరుగుతోందన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునికష్ణ నాయుడు మాట్లాడుతూ సీఎం అందిస్తున్న ఆదరణతో విద్యార్థులు క్రమశిక్షణగా చదువుకొని భవిష్యత్తులో ఉన్నత హోదాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బసవా బాలసుబ్రమణ్యం, పాఠశాల ఉపాధ్యాయులు జయంతి, హేమమాధురి, కష్ణవేణి, సుజాత, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిన్నగొట్టిగల్లు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపీపీ బాలం యుగంధర్ రెడ్డి బుధవారం అందించారు. స్థానిక ఎంపిపి పాఠశాల విద్యార్థులకు ఈ కిట్లను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మదులా దేవి, ఎంఈఓ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.